కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలి

సేవలు మరింత విస్తృతం- వాలంటీర్లను నియమించింది మనమే

తమ హయాంలోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఒక్కో సచివాలయం పరిధిలో ముగ్గురు చొప్పున కన్వీనర్లను నియమించడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అయ్యాయని జమ్మలమడుగు శాసనసభ్యులు డా.మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం ఆవరణలో గురువారం మండల స్థాయి సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం వైసీపీతోనే సాధ్యమైందని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించేందుకు వీలుగా పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వాలంటీర్లు తమ పార్టీ నియమించిన వారేనని సచివాలయాల ఉద్యోగులు పరీక్షలు రాసి ఉద్యోగాలు సంపాదించినప్పటికీ ఆ అవకాశం కల్పించింది వైసీపీ ప్రభుత్వమేనంటూ ఆయన గుర్తుచేశారు. వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తొలగిపోయాయని గుర్తుచేశారు. సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ పథకాలు అర్హులకు దక్కేలా కృషి చేయాలని సూచించారు. కులం, మతం, ప్రాంతం, వర్గ రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరేలా పనిచేయడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట పెంచాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వలన ఇక్కడి నిరుద్యోగ యువతకు అధిక శాతం ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు సాధించిన అభివృద్ధి శూన్యమని తమ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని ఆయన గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా జగనన్న మరోమారు ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకుడనేవాడు సేవకుడిగా ఉండాలే తప్ప ఉన్నత వర్గాలకు అనుకూలంగా వ్యవహరించ రాదని గుర్తుచేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి మూలె సురేంద్రారెడ్డితో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న నాగరాజు హైకోర్టు కేసు విషయంపై రాజీ కావాలని బెదిరించి అనారోగ్యానికి కారకులైన నగరపాల సంస్థ మేనేజర్ పై విచారించి తగు చర్యలు తీసుకోవాలని, వైద్యానికి అయ్యే ఖర్చులను నగరపాలక సంస్థ చెల్లించాలని గురువారం కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్‌కి ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దే.మద్దిలేటిలు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజర్ కింది స్థాయి ఉద్యోగులను, సచివాలయ సిబ్బం దిని కమీషనర్ పేరు చెప్పి బెదిరించడమే కాకుండా మీ స్థానాలను తస్మాత్ జాగ్రత్త మారుస్తా అని చెబుతున్నాడని ఆరోపించారు. కమిషనర్ ను హైకోర్టుకు లాగుతావా నువ్వు ఎక్కడ పని చేయాలో ఆలోచించు కోవాలని నాగరాజును సహ ఉద్యోగుల సమక్షంలో బెదిరించడం, అరియర్స్ డబ్బులు విషయంలో రాజీకి రావాలని హెచ్చరించడం సరైనది కాదన్నారు. ఇటీవల స్వచ్ఛభారత్ నిధులు ఖర్చుల్లో కూడా చేతివాటం ప్రదర్శించాడని, నగరపాలక సంస్థలో ప్రతి బిల్లులో మేనేజర్ జోక్యం చేసుకుంటున్నారని శానిటేషన్, సిటీ ప్లానింగ్, ఱవెన్యూ, పిహెచ్చి తదితర విభాగాలు అన్నింటిలో కమిషనర్ తర్వాత కమిషనర్ అంతటి వాడినని చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. నగరపాలక సంస్థ రెగ్యులర్ ఉద్యోగులను అటు కార్పొరేటర్స్ ను బురిడీ కొట్టిస్తూ వస్తున్నాడని ఇతనిపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ మేయర్ సురేష్ బాబు దృష్టికి స్థానిక ఎమ్మెల్యే ఉపముఖ్యమంత్రి అంజాద్ భాష దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

ఘనంగా సంజీవిని హోమియోకేర్ ఐదవ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ రైల్వే స్టేషన్ రోడ్డు లోని సంజీవిని హోమియోకేర్ ఐదవ వార్షికోత్సవము డాక్టర్ ఎన్ జవహర్ రెడ్డి, డాక్టర్ సుస్మిత రెడ్డిలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి, ఉచిత మెడికల్ క్యాంప్‌లో రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవే ధ్యేయంగా వైద్యసేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం ఎన్. శ్రావణి, ఇ.నాగసుబ్బారెడ్డిలు మాట్లాడుతూ సంజీవిని హోమియోకేర్ ద్వారా మంచి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఎన్.జవహర్ రెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డిలు ప్రశంసనీయులు అన్నారు. కడపలో రెండు బ్రాంచ్‌ల ద్వారా పలు మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహించి, కడప జిల్లా నలుమూలల నుండి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ కడపలోనే హోమియోకేర్ ను అగ్రస్థానంలో నిలిపారన్నారు. ముమ్ముందు వారు ప్రజలకు మరెన్నో మెరుగైన వైద్య సేవలందించి అనేక బ్రాంచీలుగా విస్తరించి అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మశాన స్థలం కేటాయించాలని తహసిల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండల గ్రామాలలో ఎస్సీలకు త్వరితగతిన స్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలని మండల తహసిల్దార్‌కి సంఘ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ముండ్లపాటి పిచ్చయ్య మాట్లాడుతూ పట్టణంలోని సురేంద్ర నగర్‌లో గత 40 సంవత్సరాలుగా నివాసం ఏర్పరచుకొని 200 కుటుంబాలు దళితులు ఉన్నారని వారికి ఇప్పటికీ దహన సంస్కారాలు ఖననాలు చేయుటకు స్మశాన స్థలం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈమధ్య ఆంధ్రప్రదేశ్ సీఎం అన్ని దళితవాడలకు స్మశానాలు స్థలాలు కేటాయించాలని లేకపోతే భూమి కొని అయిన స్మశానాలు ఏర్పాటు చేయాలని జీవో విడుదల చేయడం జరిగిందని ఈ జీవో ప్రకారం రెవెన్యూ అధికారులు తక్షణమే దళితవాడను పర్యటించి స్మశానం లేని దళితవాడలకు స్మశాన స్థలాలు కేటాయించి వలన ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, దళిత నాయకులు ఓఎస్‌వి ప్రసాద్, వెంకటేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డిజిటల్ విద్య చారిత్రకం

విశాలాంధ్ర-తొండూరు: పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టడం చారిత్రకమని డిస్ట్రిక్ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులు పైడిపల్లి కిశోర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక స్ఫూర్తితో పేద విద్యార్థుల సంక్షేమం కోసం 8వ తరగతి నుంచి డిజిటల్ బోధన తీసుకురావడం హర్షించతగ్గ విషయమన్నారు. ఆధునిక బోధనా విధానాలను అనుసరిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ రీతిలో అత్యున్నత పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రతి తరగతి గదిలో డిజిటల్ విద్యా బోధనను శ్రీకారం చుట్టారని, అంతేగాక విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో మరింత నిశితంగా అర్థమయ్యేలా బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ డిస్ప్లే ప్రొజెక్టర్లను ఏర్పాటు చేయడం ఇంటర్ ఆక్టివ్ టీవీల నాణ్యత మెరుగ్గా ఉండేలా చూడటం గొప్ప విషయమన్నారు. స్మార్ట్ బోధనా సదుపాయాల వల్ల ఇటు పిల్లలకు అటు ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని పైడిపల్లి తెలియజేశారు. అలాగే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు నాణ్యతతో కూడిన ట్యాబులు ఇవ్వడం ఆ ట్యాబుల్లోకి హెడ్ టెక్ సమస్త బై జ్యూస్ కంటేను అప్లోడ్ చేయడం వీటి ద్వారా ఉన్నత ప్రమాణాలున్న విద్యను అందుబాటులోకి తీసుకురావడం విద్యార్థిని విద్యార్థులకు స్కూల్స్ టాయిలెట్స్ అలాగే గ్రౌండ్స్ వంటివి ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రేమాభిమానాలను పొంది జగన్ మామయ్యగా పిలుస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకులకు జరిమా నా విధించారు. అనంతరం ఎస్ఐ తిరుపాల్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. అలాగే లైసెన్సు కలిగి ఉండాలని, ప్రతి డ్రైవరు యూనిఫామ్ ధరించాలన్నారు. అదే విధంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అధికలోడు, అధిక స్పీడు కూడా చట్టరీత్యా నేరమన్నారు. అందుకు శిక్షార్హులన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌కు సత్కారం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : వైయస్ఆర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా లింగాల ఉషారాణి పదవి బాధ్యతలు స్వీకరించి నేటికి ఒక సంవత్సర కాలం అయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు చిరు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా యస్.అమీరుద్దిన్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో మేడం నిజాయితీగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి సమూల మార్పు తీసుకువస్తున్నారని గ్రంథాలయాల అభివృద్ధికి కొరకు ఎంతగానో కృషి చేస్తున్నారని స్థానిక సంస్థలు బకాయి పడ్డ లైబ్రరీ సెస్స్ సుమారుగా 3 కోట్ల రూపాయలు వసూలుకు కృషి చేశారన్నారు. ఒక సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా నేడు ఉద్యోగులు చైర్‌పర్సన్ ఎల్.ఉషారాణికి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ నేను వచ్చినప్పటి నుండి వివిధ మునిసిపాలిటీల నుండి రావలసిన మొత్తం నుండి రూ.3 కోట్లు వసూలు కావడం జరిగిందన్నారు. రూ.88 లక్షలతో కొత్త పుస్తకాలను కొనుగోలు చేయడం జరిగిందని వేల్పుల డిజిటల్ లైబ్రరీ సి.యం. చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కడప, పులివెందుల, వేల్పులలో జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం సీఎం వైఎస్ జగన్ సహకారంతో సొంత భవనాలులేని లైబ్రరీలకు సొంత భవనాల ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నాయకుడు నాదెండ్ల బాబ్జి, సురేష్, లింగాల రామలింగారెడ్డి లైబ్రేరియన్స్, యస్.సుబ్రమణ్యం, జునియర్ అసిస్టెంట్, శ్రీనివాస చారి, టైపిస్ట్ ప్రదీప్‌కుమార్, లైబ్రేరియన్స్ నవాబ్ జాన్, ఇబ్రహీం సాహెబ్, వెంకటేశ్వరమ్మ, లక్ష్మినారాయణమ్మ, నాగాంజలి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, జిల్లాలోని ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు.. సామాజిక భద్రతకు ముప్పు

విశాలాంధ్ర-వేంపల్లె: పింఛన్ల తొలగింపు అంశం సామాజిక భద్రతకు ముప్పు అని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు రామచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6లక్షల మంది పింఛన్లను తొలగించే విషయమై నోటీసులు జారీ చేసిందన్నారు. 300యూనిట్ల కరెంటు బిల్లు దాటినా, వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉన్నా అదే 10 ఎకరాలకు పైబడి పొలం ఉన్నా సామాజిక పింఛన్‌కు అనర్హతగా గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారన్నారు. నోటీసులు అందుకున్న 15రోజుల లోపు సంజాయిషీ ఇవ్వని పక్షంలో పింఛన్లను శాశ్వతంగా తొలగిస్తామంటూ ఆ నోటీసులో హెచ్చరికలు కూడా జారీచేసిన విషయాన్ని రామచంద్రుడు గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతకు ముందు నుంచి అందుకుంటున్న పింఛన్ నిబంధనల పేరిట తొలగిస్తే అవ్వాతాతల పరిస్థితి ఏమిటనీ ఆయన ప్రశ్నించారు. కాగా వచ్చే నెల నుంచి పింఛన్ సొమ్ము రూ.250లు పెంచి అంటే రూ.2750లు ఇవ్వనున్నారు. ఒక వైపు పింఛన్ సొమ్ము పెంచుతూనే మరోవైపు లక్షలాది మంది పింఛన్లను కోత పెట్టడమంటే ఇదేనా సామాజిక భద్రత అంటూ ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి మరింత వ్యతిరేక చోటుచేసుకోక ముందు నోటీసులు అందజేసిన పింఛన్ల తొలగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని రామచంద్రుడు కోరారు.

అసత్య ఆరోపణలు చేయడం మంచిదికాదు :సర్పంచు సులోచన

విశాలాంధ్ర-వేంపల్లె: తమ గ్రామంపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మంచిదికాదని నందిపల్లె పంచాయతీ గ్రామ సర్పంచు మారంరెడ్డి సులోచన హితవు పలికారు. బుధవారం కొంత మంది టీడీపీ నాయకులు నందిపల్లె గ్రామంపై చేసిన అసత్య ఆరోపణలను ఆమె ఖండించారు. ఆమె మాట్లాడుతూ నాగమల్లి అను మహిళ కి భర్త చనిపోయి ముగ్గురు పిల్లలు ఉన్న కారణంగా ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్ చేయించలేదన్నారు. వాస్తవం ఏంటంటే నాగమల్లి అనే మహిళకు జనవరి 2020 సంవత్సరం నుండి పింఛన్ వస్తోందని, ఈనెల అంటే డిసెంబర్‌లో కూడా పింఛన్ తీసుకున్నారన్నారు. ఆ మహిళకు పెన్షన్ కాకుండా వాళ్ళ పెద్ద కొడుకుని హాస్టల్లో చేర్పించామన్నారు. ఆమెకు రేషన్ కార్డు కడప నుండి నందిపల్లె మార్చి ఇల్లు కూడా దరఖాస్తు చేశామన్నారు. ఆమె పింఛన్‌కు సంబంధించిన ఆధారాలు అందిస్తామన్నారు. ఆమెను మీడియా ముందుకు తీసుకువచ్చి పెన్షన్ రాలేదని చూపించగలరా అంటూ ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేసినందుకు టీడీపీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ గారూ.. మీ మండల నాయకుల ప్రెస్మీట్లో కంటెంట్ ఒకసారి చూసుకోవాలని వెల్లడించారు.

సమాజ అవగాహనకు సిఎస్‌పి కీలకం

విశాలాంధ్ర-కడప వైవీయూ : సమాజం పట్ల బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దేందుకు నూతన విద్యా విధానం లో కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు అత్యంత కీలకమైనదని కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య వై సుబ్బరాయుడు అన్నారు. వైవీయూ సివి రామన్ సైన్స్ సెమినార్ హాల్లో కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు కళాశాలల సమన్వయకర్తల శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. విద్యార్థి తన చుట్టూ ఏమి జరుగుతున్నది తెలుసుకోవాలంటే సమాజంలోకి వెళ్లాలని, అప్పుడే అవగాహన పెరుగుతుందన్నారు. సమాజంలోని సమస్యలను అర్థం చేసుకోవాలన్నా, సామాజిక సమస్యలకు పరిష్కారాలు రూపొందించాలన్నా కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులో పనిచేయడం అత్యంత అవసరమని అన్నారు. బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రు ఎడ్యుకేషన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ సర్వేకు సంబంధించి సామాజిక సమస్యను ఎలా ఎంపిక చేసుకోవాలో, ప్రశ్నావళిని ఎలా రూపొందించుకోవాలో, సమాచారాన్ని ఎలా సేకరించాలో, ఎలా విశ్లేషించాలో, ప్రాజెక్టును ఎలా రాయాలో సవివరంగా తెలియజేశారు.

విద్యార్థులకు ఉచిత ట్యాబుల పంపిణీ

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థుల కు ఉచిత ట్యాబు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో రానున్న కాలంలో నేటి విద్యార్థులు రేపటి భావితర పౌరులుగా సమాజ నిర్దేశికులుగా ఒక ఉన్నత స్థానానికి ఎదగాలంటే వారికి చదువుతోపాటు ఆటలు, పాటలు,మాటలలో నైపుణ్యం సంపాదించాలని ఆటల ద్వారా విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు ఒక బలమైన మనస్తత్వాన్ని పాజిటివ్ దృక్పదని ఏర్పరచుకొని ప్రతి ఓటమిని విజయానికి నాందిగా భావించి ఓటమిని స్పోర్టివ్ గా తీసుకొని విజయం కోసం ప్రయత్నించినప్పుడు తప్పకుండా విజయం సాధిస్తారని ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం లక్ష్యంతో తపన తోటి ప్రయత్నం చేసినప్పుడు తప్పకుండా విజయం సాధిస్తారని ఆయన తెలిపారు. విశ్రాంత డిప్యూటీ డిఈఓ నాగ మునిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బాలఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఉన్నతమైన భావాలతో కూడిన వ్యక్తిత్వాన్ని ,మనస్తత్వాన్ని అలవర్చుకొని ఎదగాలన్నారు. పాఠశాల ప్రత్యేక అధికారి భాషా మొహిద్దిన్ మాట్లాడుతూ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రంలోనే క్రీడలకు ప్రత్యేక స్థానం గల ఏకైక పాఠశాల అని ఈ పాఠశాలలో నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు సుమారు 350 మంది విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో మంచి నైపుణ్యం సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది క్రీడలకు సంబంధించిన శిక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ధ్యేయం: ఎంపీపీ

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: విద్యార్థుల భవిశ్యత్తును దృష్టిలో పెట్టుకొని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చక్కటి విద్యా బోధనలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకం చుట్టిందని మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రేకులకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలను పరిశీలన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నా గోరుముద్దను పరిశీలన చేపట్టారు. మెనూను తప్పకుండా పాటించాలని, మెనూలో లోపాలు ఉన్న వారిపై చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అమ్మఒడి, వసతిదీవెన వంటి పథకాలు అందిస్తున్నది తమ ప్రభుత్వమే అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలన చేసి బాలింతలకు, చిన్నారులకు రావాల్సిన పౌష్టికాహారంపై మెనూను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మండల ఉపాధ్యక్షురాలి భర్త, మాజీ సొసైటీ డైరెక్టర్ కూనపులి రాజా, వైకాపా నాయకులు బసిరెడ్డితో పాటు పలువురు వైకాపా నాయకులు పాఠశాల సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ సురేష్‌బాబులు పాల్గొన్నారు.

క్రొత్త పింఛన్ల కోసం.. ఉన్న పెన్షన్లు తొలగిస్తారా?: సీపీఐ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : మీరు కొత్త పెన్షన్లు ఇచ్చేందుకై కడుపు నిండా తిండి పెడుతున్న అవ్వా తాతల పెన్షన్లు పొంతన లేని కారణాలతో తొలగించడం ఎంత వరకు న్యాయమని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్‌లు అధికారులపై మండిపడ్డారు. ఉన్న పెన్షన్లు తొలగించడం సరికాదంటూ గురువారం పోరు మామిళ్ళ మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొందరి ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్, కూలర్, కారు, స్కూటర్లు ఎవరో ఒకరు కలిగి ఉంటారని,అది కరెంటు వాడకం, భూమి ఎక్కువ ఉంటుందన్నారు., అయితే అధికారులు అధికార పక్షంకాని వారివి, అడిగేవారు లేరనే వారి పెన్షల ను ఇతరుల ఆధార్ కార్డు నెంబర్ జతచేసి వీరికి ఉన్నట్లు చిత్రీకరించి తొలగించడం ఎంతవరకు న్యాయమో ఆలోచించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయము, వాలంటరీలతో పూర్తి విచారణ చేసి అర్హులైన ప్రతి పెన్షన్ దారుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కేశవ, సీపీఐ నాయకులు చెన్నయ్య, పిరయ్య పాల్గొన్నారు.

1న ఘనంగా ఓబులేసు స్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : మండలంలోని బివిగ్రగుడి గ్రామంలో ఓ పెద్దకొండ పైన ఓబులేసు స్వామి వెలసి ఉన్నాడు. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన ఓబులేసు స్వామి కళ్యాణోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు వేంపల్లి చైతన్య స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి స్వామివారి పూజలు అభిషేకాలు కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ప్రతిఏటా బంద్రెడ్డి కుటుంబంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వివిధ కళాకారులచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చెంచులక్ష్మి అమ్మవారు ఓబులేసు స్వామికి గిరిపైన పూజలు నిర్వహించి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ గిరిపైకి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణోత్సవం వీక్షిస్తారు.

మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని రేకులకుంట పరిధి లో ఉన్న బాలాజి నగర్ వద్ద మత్స్య కారులకు జీవన ఉపాధి కొరకు చేపల పిల్లలను విడుదల చేసి వాటిని పెంచి మత్స్యకార కుటుంబాలకు జీవన ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి వారి కుటుంబాలకు ప్రత్యేకంగా వారికి నిధులు కేటాయిం చిందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం చేప పిల్లల విడుదల కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్యం వహించా రని, సమయపాలన పాటించడంపై వారిపై మండిపడి తిరిగి వెళ్లారు. చేప పిల్లల విడుదల కార్యక్రమానికి బ్రహ్మంగారి మఠం జడ్పీటీసీ రామగోవిం దారెడ్డి, మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి వారికి అప్పజెప్పి తిరిగి వెళ్లినట్లుగా సమాచారం. చేప పిల్లల విడుదల కార్యక్రమాంలో పాల్గొని వారి చేతులమీదుగా విడుదల చేపట్టారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడు తూ మండలంలోని 78మంది మత్స్యకారులకు లైసెన్స్‌లు ప్రభుత్వం కల్పించిందని ప్రస్తుతం 48మందికి మాత్రమే లైసెన్సులు ఉన్నాయని ఇప్పుడు వారికి జీవన ఉపాధి కొరకే చేపల పిల్లలను విడుదల చేయం జరిగిందని అన్నారు.

అధికారుల నిర్లక్ష్యం: చేప పిల్లల విడుదల కార్యక్రమానికి వాటిని సాగర్‌లో వదిలేందుకు ఆక్సిజన్ లేకుండా చేప పిల్లలను తీసుకువెలుతుండగా కొన్ని ఆక్సీజన్ లేకుండా ఉండటంతో కొన్ని చేప పిల్లలు చనిపోయి నీటిపై తేలాడుతుండటంపై అధికారుల నిర్లక్ష్యమే అని గ్రామస్థులు, మత్స్యకారులు తెలిపారు. ఉదయం 8గంటలకు వదలాల్సిన చేపలను మధ్యాహ్నం 12గంటల సమయంలో మినీలారికి కవర్‌లు ఏర్పాటుచేసి వాటిని రోడ్డు వెంబడి తరలించడంతో చేప పిల్లలు అన్ని రోడ్లపై పడుతూ వెల్లాయని అధికారులు నిర్లక్ష్యమే అని ప్రజలు ఆరోపించారు.

విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : నూతన సంవత్సరపు విశాలాంధ్ర క్యాలెండర్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు నగర అధ్యక్షుడు విష్ణుప్రీతమ్ రెడ్డి గురువారం డీసీసీ కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ పొందిన పత్రిక విశాలాంధ్ర దినపత్రిక అని ప్రజలకు ఎంతో చేరువైన పత్రిక అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకురావడంలో ముందుంటుం దన్నారు. పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తాయని సమాజంలో జరిగే మంచి చెడులను పత్రికల ద్వారానే అధికారులకు తెలియజేయడం జరుగుతుంద`న్నారు.

విద్యార్థులకు వేమన పద్య పోటీలు

విశాలాంధ్ర-సిద్ధవటం : మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ పంచాయ తీలోని శ్రీ సాయి హైస్కూల్ విద్యార్థులకు గురువారం వేమన పద్యపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ శంకరయ్య, కడప జిఆర్టిజివికె కళాశాల హైస్కూల్ కరస్పాండెంట్ శంకర్, కడప నారాయణ కళాశాల ఫీజిక్స్ లెక్చరర్ సుబ్రహ్మణ్యంలు గెలుపొందిన విద్యార్థులకు సీనియర్, జూనియర్ రెండు కేటగిరిలుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి సన్మార్గంలో నడవాలని కష్టపడి చదివి ఉన్నత స్థానాలు అందుకోవాలని, పాఠశాలలోని విద్యార్థులను చూస్తుంటే మంచి క్రమ శిక్షణతో ఉన్నారని విద్యార్థులను ఉద్యేశించి ప్రసంగాన్ని కొనసాగించారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన తర్వాత ఎంఈఓ శంకరయ్యకు ముఖ్య అతిథులుగా హాజరైన జిఆర్టిజివికె హై స్కూల్ కరస్పాండెంట్ శంకర్, నారాయణ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ సుబ్రహ్మణ్యంలకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట సుబ్బయ్య, హెడ్మాస్టర్ రేవతి దేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ సారధి, పథకాల రారాజు సీఎం జగన్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాయచోటి నియోజక వర్గంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంటోంది. ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నారు. అన్ని ప్రాంతాలలోనూ ప్రజల నుండి మంచి స్పందన దక్కుతోంది. గడప గడపకు శ్రీకాంత్ రెడ్డి రాక నేపథ్యంలో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి గడపలో కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడంతో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం కనిపిస్తుంది. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం లక్కిరెడ్డిపల్లె గ్రామం లోని 1, 2 సచివాలయాల పరిధిలో ఐదో రోజు ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్యలతో కలసి ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత మసీదు, వేంపల్లె రోడ్డు, కొత్త బస్ స్టాండ్, కొత్తకొట్టాలు, విశ్వభారతి స్కూల్, పూసల కాలనీ, వెంకటేశ్వర వీధిలలో శ్రీకాంత్ రెడ్డి ఇంటింటికెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగప్రసన్న లక్ష్మి, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కోఆప్షన్ నెంబర్ సయ్యద్ అమీర్, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ విజయభాస్కర్, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, శంకర్‌నాయుడు, సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచులు రామచంద్ర, వైసీపీ బీసీ నాయకులు రవి ఆచారి, మైనార్టీ నాయకులు చాన్ భాష, నన్నేసాబ్ సాహెబ్, వాలిధ్ నభి, జాకీర్, నాసిర్ బాబ్జాన్, ఖాజా, సయ్యద్ యిర్షద్, హర్షద్, అన్వర్, ఇస్మాయిల్, హనీఫ్, యిర్శాద్, అర్షద్, వార్డు మెంబర్ వరుణ్ కుమార్, వైసీపీ నాయకులు బసయ్య, మల్లికార్జున్, లక్ష్మీరెడ్డి, రవి, పురుషోత్తం, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే సహించం

విశాలాంధ్ర-కడప రూరల్ : కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టే వ్యవ సాయ మోటార్లకు మీటర్లు పెడితే సహిం చేది లేదని రైతులు ఎక్కడికక్కడ మీటర్లను ధ్వంసం చేయక ముందే విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. కాటమయ్య అన్నారు. గురువారం ఎద్దుల ఈశ్వర్ రెడ్డి భవన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నిర్మాణ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.వి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కాటమయ్య మాట్లాడుతూ 2022 కు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రగల్బాలు పలికిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని ఇంకా రైతులకు నష్టాన్ని కలిగించే విధంగా చట్టాలు చేయటం వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడం వంటి రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొస్తుందని దీన్ని ప్రతి పౌరుడు వ్యతిరేకిస్తున్నారన్నారు. రాయలసీమ నీటి పారుదల ప్రాజెక్టుల కోసం పోరాటాలు అనివార్య మని భవిష్యత్ పోరాట కరాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏవి రమణ, గాలి చంద్ర, కొమ్మది ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి, బాలచంద్రయ్య, యానాదయ్య, చెన్నారెడ్డి, మనోహర్ రెడ్డి, మేకల జయన్న, చిలుంగారి పుల్లయ్య, రామలింగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సిపిఐ నాయకులు నాగేశ్వరరావు, శివారెడ్డి, షావలి, భాష, మురళి పాల్గొన్నారు.

కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కందుకూరులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో అపశ్రుతి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన మన కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. వారి కుటుం బాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజే స్తున్నానన్నారు. చంద్ర బాబు నాయుడు స్వయంగా హాస్పిటల్‌కి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేశారని వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు. కందుకూరు బహిరంగసభ సంతాప సభగా మారడం అత్యంత బాధకరమన్నారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

వెంకటరామిరెడ్డికి అభినందనలు

విశాలాంధ్ర-పులివెందుల: ఆంధ్ర ప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రెండవ సారి అత్యధిక మెజారి టీతో విజయం సాధించిన కాకర్ల వెంకట్ రామిరెడ్డికి రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి,, వై సీపీ నాయ కులు సిద్దయ్యలు అభినందనలు తెలిపారు. విజయవాడలో గురు వారం వారు విజయవాడలో వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వెంకట రామిరెడ్డిని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీపై బహిరంగ సభ

విశాలాంధ్ర-వేంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై 2020-21 అలాగే 2021-22 సంవత్సరాలకు సంబంధించి 15,16వ విడత సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

బావర్చి బిర్యానీ సెంటరు ప్రారంభం

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సి ఎస్ఐచర్చ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బావర్చి బిర్యానీ సెంటర్‌ను పులివెందుల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వైస్ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, తొండూరు మండలం ఇంచార్జి వైయస్ మధుసూదన్ రెడ్డిలు ప్రారంభించారు. బావర్చి బిర్యానీ భలే రుచిగా ఉందని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్ట నష్టపరిహారమై వాగ్వివాదం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని రాజోలి ఆనకట్ట నిర్మాణానికి సంబందించిన భూములు నష్టపోయిన గ్రామాల లోని రైతులకు నష్టపరిహారానికి సంబందించిన విషయంపై గురువారం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే ఎమ్మెల్యే వర్గీయుల్లోనే కొంత మంది నష్టపరిహారానికి సంబం దించి ధర విషయంలో విబేధాలు రావడంతో రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. ఆనకట్ట పరిధిలో నష్టపోయిన గ్రామాల రైతులకు నష్టపరిహారం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని సుధీర్‌రెడ్డి తగిన న్యాయం చేస్తారని ఎంతో ఆశించామని ఆశించిన స్థాయిలో భూములు కోల్పోయిన తమకు గిట్టుబాటు ధర రావడం లేదని మరికొందరు వివాదానికి దిగారు. ఈ పరిస్థితిని పోలీసులు రంగ ప్రవేశం చేసి అదుపు లోకి తీసుకువచ్చారు.

రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం: ఎమ్మెల్యే సుధ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యపడుతుందని బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధా పేర్కొన్నారు. గురువారం గడపగడప కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల మండలంలో రంగసముద్రంగ్రామ పంచాయతీలో ముందుగా శ్రీ మద్దిమడుగు స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గురప్పగారి పల్లె రంగసముద్రం గడప గడప ప్రోగ్రాంలో భాగంగా నవరత్నాలలోని సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సి.భాష, చెన్నయ్య, సర్పంచ్, కల్లూరు రమణారెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, మహబూబ్ పీర్, బద్వేల్ వైఎస్ఆర్సిపి యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, చాపాటి నారాయణరెడ్డి, కోఆప్షన్ నెంబర్ అల్లా, బోర్ రామసుబ్బారెడ్డి, గంగన్న, హుస్సేన్ రెడ్డి, ఆదిబోయిన కొండయ్య, వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మైలవరం : రాష్ట్రము లోని రైతుల సంక్షేమ మే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయం అని జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి అన్నారు.గురువారం ఉదయం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా, రబీ, ఖరీఫ్ లకు పంట నష్టపరిహారం చెల్లింపులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ కే చెందుతుందని అన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ఎవరికైనా అర్హులైన వారికి పథకాలు అందుకుంటే సంబందించిన సచివాలయ లలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలనీ, ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మైలవరం జలాశయం లో ఆత్మహత్య చేసుకున్న గోవర్ధన్ పిల్లలకు నగదు అందించి ప్రభుత్వ పరంగా సహాయనికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, నేతలు చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి,మండల వైకాపా కన్వీనర్ మహేశ్వర రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి,యర్రబోలు భాస్కర్ రెడ్డి,వినయ్ కుమార్ రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులోకి జానీస్ ఫ్యాషన్ వరల్డ్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్థానిక వైవి స్ట్రీట్ వీధి ప్రారంభంలో అబ్దుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానీస్ ఫ్యాషన్ వరల్డ్‌ను మాజీ డిప్యూటీ మేయర్ బి ఆరిపుల్ల అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూడకుండా ఉపాధి మార్గాలు ఎంచుకోవడం ఎంతో అభినందనీయం అన్నారు. అనంతరం షోరూమ్ యజమాని అబ్దుల్లా మాట్లాడుతూ మా షాపు నందు అన్ని రకాల దుస్తులు పిల్లలు పెద్దలకు సంబంధించిన షర్టులు, టీ షర్టులు, ప్యాంట్లు, దుస్తులు లభిస్తాయన్నారు. మా షాపు 30 సంవత్సరాల నుండి ప్రజలకు నాణ్యమైన దుస్తులు అందించి ప్రజా మన్ననలు పొందడం జరిగిందని తెలిపారు. షాపును నూతనంగా తీర్చిదిద్ది నాణ్యమైన మన్నిక గల దుస్తులు హెూల్ సేల్ రేట్లకే రిటైల్‌గా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హనిఫ్, జుబేర్, గౌస్‌పీర్, మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరైనారు.

క్రీడా విభాగంలో రాణించిన నారాయణ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వున్న నారాయణ హైస్కూల్స్ మధ్య నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో హౌసింగ్ బోర్డ్ బ్రాంచ్ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. స్థానిక మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నమయ్య, కడప జిల్లా వ్యాప్తంగా వున్న నారాయణ హైస్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్లో తమ విద్యార్థులు రానించటం పట్ల ఎంతో సంతోశంగా వుందని హౌసింగ్ బోర్డు బ్రాంచ్ ప్రిన్సిపల్ గీత అన్నారు. క్రీడా విభాగంలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, త్రోబాల్ మొదలయిన ఆటలలో రాణించినందుకు హౌసింగ్ బోర్డు బ్రాంచ్ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఏజియమ్ రాజు, ఆర్ఐ కిరణ్ కుమార్ అభినందిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వున్న నారాయణ హైస్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రీసెంట్ ట్రెండ్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీపై అంతర్జాతీయ వర్చువల్ సమావేశం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో, కళాశాల ఈఈఈ విభాగం వారి ఆధ్వర్యంలో రీసెంట్ ట్రెండ్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ -2022 అనే అంశంపై వర్చువల్ విధానంలో అంతర్జాతీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్త డాక్టర్ సుచార్ట్ యమ్మిన్ అసోసియేట్ ప్రొఫెసర్ నరేసువాన్ విద్యాలయం థాయిలాండ్ నుండి మాట్లాడుతూ సిగ్నల్ ప్రాసెసింగ్ కోసం డేటా డిపెండెంట్ లీనియర్ డికంపోజిష న్ ట్రాన్స్‌ఫార్మర్ అనే అంశంపై చక్కగా ఉపన్యసించారు. ఈ ఉపన్యాసానికి భారతదేశం నుండి, థాయిలాండ్ నుండి దాదాపుగా 200 మంది డేలేగట్లు ఈ వర్చువల్ సమావేశానికి హాజర య్యారు. ఈ సమావేశం యొక్క ముఖ్య లక్ష్యం విద్యావేత్తలచే తాజా పరిశోధన పనిని ప్రదర్శించడానికి వివిధ ప్రాంతాల ప్రతినిధులకు కొత్త ఆలోచనలు, అనువర్తన అనుభవాలను ముఖాముఖిగా మార్పిడి చేసుకోవడానికి భవిష్యత్తు కార్యాచరణ సహకారం కోసం ప్రపంచ వ్యాప్తంగా భాగస్వాములను చేయడానికి అవకాశాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి (నాని), ప్రధానాచార్యులు డాక్టర్ వివిఎస్ మూర్తి, ఈఈఈ విభాగాధిపతులు డాక్టర్ ప్రియదర్శిని, ప్రోగ్రాం సమన్వయకర్తలు డాక్టర్ కుమార్ రెడ్డి, చీపాటి, డాక్టర్ వి.మహేష్ కుమార్ రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారంలో పొరపాటు జరిగింది: టీడీపీ

విశాలాంధ్ర-చెన్నూరు : కందు కూరులో తెలుగు దేశం పార్టీ జాతీ య ప్రధాన కార్యదర్శి చంద్రబాబు నాయుడు ప్రచారంలో బుధ వారం జరిగిన సంఘటన పొరపాటున జరిగిందే తప్ప ఎలాంటి ప్రచార ఆర్భాటానికో ఇంకొకరు కావాలని చేసింది కాదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. గురు వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందుకూరులో మృతి చెందిన బాధితులకు టీడీపీ తరపున వారి కుటుంబానికి అండగా నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కానీ కొంత మంది ప్రతిపక్ష పార్టీ నాయకులు భూతద్దంలో చూడడం మంచిది కాదన్నారు. గతంలో గోదావరి నదిలో బోటు ప్రమాదంలో దాదాపు 40 నుంచి 50మంది మృతి చెందారని అలాంటి దానిని రాజకీయం చేయడం సబబు కాదన్నారు. ఏదైనా వారికి సహా యం చేయాలనుకుంటే ప్రత్యక్షంగా సాయం చేయాలే తప్ప రాజకీయం చేయ డం సిగ్గుచేటన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చెన్నూరు క్లస్టర్ ఇన్‌చార్జి తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి, సుంకేసుల శ్రీనివాసులు, సుబ్బయ్య, ఆటో బాబు పాల్గొన్నారు.

పడమటి వీదిలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి"

విశాలాంధ్ర-కమలాపురం : టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షులు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నగర పరిధిలోని 15,వ వార్డులో "ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి" కార్యక్రమంని తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి, , మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి నగర అధ్యక్షుడు దివాకర్ రెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కాపు ప్రచార నాయకుడు దాదిరామయ్యలు ఆ వార్డులోని ఇంటి ఇంటికి వెళ్ళి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకుని, పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రంలో వివరములు సేకరించి, పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్ 9261292612 కి మిస్డ్ కాల్ ఇవ్వమని, రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, ప్రసాద్ రెడ్డి విబరాపురం నాగేంద్ర, పల్లె రామసుబ్బారెడ్డి, మల్లికార్జున శెట్టి, రామమునిరెడ్డి, అన్వర్ భాష, ఐటీడీపి, అబ్దుల్ నబీ, నిజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, మెరిన్ ప్రసాద్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు దేవుడి ఆశీస్సులు
విద్యుత్ సిబ్బంది ఆకాంక్ష- ఘనంగా ఏఈ జన్మదిన వేడుక

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఇక్కడి ట్రాన్స్‌కో విభాగంలో ఏఈగా పనిచేస్తున్న సుబ్బారావు జన్మదిన వేడుకను గురువారం ఆ శాఖకు చెందిన సిబ్బం ది ఘనంగా నిర్వహిం చడం జరిగింది. తొలుత భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సంద ర్భంగా పలువురు ఏఈ సుబ్బారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువలు, పూలమాలలతో సత్కరించడంతో పాటు బొకేలు అందించారు. సుబ్బారావు కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరినీ పేరుపేరున పలుకరిస్తూ ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమం యావత్తు ఉల్లాసంగా గడిపారు. దేవుని ఆశీస్సులు ఏఈ సుబ్బారావుకు లభిస్తాయని ఆహుతులు ఆకాంక్షించారు. పలువురు సిబ్బంది ఏఈ సుబ్బారావు సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకోవడం కనిపించింది. ఉల్లాసభరితమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఏఈ సుబ్బారావుకు కేక్ తినిపించేందుకు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ బలరామిరెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్లు మునిరెడ్డి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్, ఎనర్జీ అసిస్టెంట్లు సునీల్, సుమన్, ఆర్.సుదర్శన్‌రెడ్డి, శేఖర్, శ్రీధర్, ఫీల్డు అసిస్టెంట్లు కమలాకర్, కరీం, సుబ్బయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగయ్య, గిరిబాబు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి :పుత్తా

విశాలాంధ్ర-చెన్నూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇదేం ఖర్మ అని ప్రజలు నెత్తినోరు కొట్టుకుంటున్నారని ఖర్మ వదిలిపోయే కాలం దగ్గరప డిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలా పురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. గురువారం చెన్నూరులోని లక్ష్మీనగర్ కాలనీలో ఇదేంఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ ఏం కొనాలన్నా కొనలేకపోతున్నామని రూ.10లు ఇచ్చి వంద రూపాయలు లాక్కుంటున్నాడని ధరల నియంత్రణ లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి కూడా అలాగే ఉందని మోటార్లకు మీటర్లు బిగించి రైతులను నట్టేట ముంచాడని గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. కావున ప్రతి ఒక్కరు వారికి జరుగుతున్న అన్యాయాన్ని గమనించి తగిన గుణపాఠం చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కల్లూరి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మల్లికార్జున రెడ్డి, చెన్నూరు క్లస్టర్ ఇన్‌చార్జి తాడి గొట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న), మైనార్టీ నాయకులు షబ్బీర్ హుసేన్, మన్సూరు అక్బర్, టీడీపీ సీనియర్‌నాయకులు ఆవుల బసిరెడ్డి, పాలగిరి సుదర్శన్‌రెడ్డి, బాలగురయ్య, చలపతి, ఆర్.సుధాకర్‌రెడ్డి, ఐటీడీపీ ఛాంపియన్ మణికంఠ, వేల్పేల సుబ్రమణ్యం, సుబ్బయ్య, బీసీ నాయకులు కృష్ణయ్య యాదవ్, సుంకేసుల శ్రీనివాసులు, ఆటోబాబు, పర్వతరెడ్డి, చెన్నయ్య, రాంప్రసాద్, పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ తప్పకుండా సమర్పించాలి

విశాలాంధ్ర- బద్వేల్ : విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షి రెడ్డి కోరారు. గురువారం బద్వేల్ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులు జనవరి 1 నుండి ఫిబ్రవరి ఆఖరి వరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లు పెన్షన్ కార్యాలయంలో చేశామని పెన్షన్ దారులు లైవ్ సెక్యూరిటీ వచ్చినప్పుడు ఆధార్ కార్డు బ్యాంకు ఎకౌంటు నెంబరు ఎఫ్ఎంఎస్ నెంబరు మొబైల్ ఫోన్ వెంటనే తీసుకురావాలని ఈ అవకాశాన్ని సర్వీస్ పెన్షనర్లు ఫ్యామిలీ పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, గౌరవ అధ్యక్షులు ఎస్ నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ పుల్ల య్య, కోశాధికారి గంగన్న, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, ఎస్ఎస్ రాణి, ఆనంద్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, గౌరవ సలహాదారులు పుల్లంరాజు, గురుమూర్తి, గురుస్వామి, నరసరాజు, సుబ్బరాయుడు, చెన్నారాయుడు పాల్గొన్నారు.

రైలు క్రింద పడి మహిళ మృతి

విశాలాంధ్ర-కమలాపురం : స్థానిక రైల్వే గేటు సమీపాన గురువారం ప్రమాదవశాత్తు ఓ మహిళ రైలు క్రిందపడి మృతి చెందింది. గురువారం మృతురాలు రైల్వే గేటు వేసి ఉండగా రైల్వే లైను దాటుకునే ప్రయత్నంలో అదే సమయంలో కడప వైపు నుండి వస్తున్న గూడ్స్ రైలు మహిళను ఢీకొంది. దీంతో మహిళదేహం చెల్లాచెదురుగా పడి మృతి చెందింది. అనంతరం సమాచారం రైల్వే పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. మృతురాలు మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన జయమ్మ (68)గా గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

భేటీ బచావో భేటీ పడావో

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : భేటీ బచావో భేటీ పడావో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా యం ఎన్ రాణి మాట్లా డుతా మునిసిపాలిటీలోని స్వయం సహాయక సంఘాల వారు మహిళలతో చాలా దగ్గరగా ఉంటారు. స్వయం సహాయక సంఘాల గ్రూప్‌లో ఉన్న మహిళలకు ఆడ పిల్ల యొక్క ప్రాముఖ్యత గురుంచి తెలియజేయటం ద్వారా బాలిక విద్యను ప్రోషహించటం ద్వారా బాలికల శాతం పెంచవచ్చన్నారు. ఎక్కడైనా అక్రమంగా స్కానింగ్ ద్వారా పుట్ట బోయే బిడ్డ ఆడ మగ అని చెబుతుంటే వెంటనే హెల్ప్ లైన్ నంబర్స్‌కు ఫోన్ చేయాలన్నారు. యువత సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సెల్ ఫోన్ వినియోగం నష్టాల మీద అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ సుభాష్ యాదవ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

సంచనాలకు మారుపేరు విశాలాంధ్ర: బిఎస్ రమణారెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: పత్రికారంగంలో విశాలాంధ్ర దినపత్రి సంచనాలకు మారుపేరని వేంపల్లె ఉషా కిరణ్ పాఠశాల కరస్పాండెంటు బిఎస్ రమణారెడ్డి కొనియాడారు. స్థానిక ఉషాకిరణ్ పాఠశాలలో గురువారం విశాలాంధ్ర దినపత్రిక రూపొందించిన 2023 నూతన సంవత్సర కేలండరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాయడంలో విశాలాంధ్ర దినపత్రిక ప్రత్యేక ఖ్యాతి గడించిందన్నారు. ఏళ్ల తరబడి సత్యశోధనలో ఎన్నో సంచలన వార్తలను ప్రజలకు చేరవేయడంలో విశాలాంధ్ర దినపత్రిక ముందంజలో ఉందని చెప్పవచ్చన్నారు. అలాగే అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో విశాలాంధ్ర దినపత్రిక ప్రత్యేక పేరుగాంచిందన్నారు. ఇలా దశాబ్దాల కాలం పాటు అవినీతి పరుల గుండెల్లో దడ పట్టించిన విశాలాంధ్ర మున్ముందు మరెన్నో సంచనాలను సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. 2023 నూతన సంవత్సర కేలండరు డిజైన్ అద్భుతంగా ఉందని శ్లాఘించారు. కార్యక్రమంలో ఉషా కిరణ్ ఉపాధ్యాయ బృందం, విలేకరి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒమైక్రాన్ వేరియంట్‌పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: ఒమైక్రాన్ బిఎఫ్-7 వేరియంట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర/ లక్ష్మిప్రియ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత (రమణప్ప సత్రంబడి) రవీంద్ర నాథ్ ఉన్నత పాఠశాలలో గురువారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో "కరోనా ఒమిక్రాన్ బి ఎఫ్ -7" వ్యాప్తి, నివారణ మార్గాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రియ మాట్లాడుతూ గత కోవిడ్ విపత్తులలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎంతోమంది ఆత్మీయులను కోల్పోయామని, కోవిడ్ వచ్చాక ఇబ్బందులు పడేకన్నా, రాకముందే జాగ్రత్తలు పాటిస్తే పెను ప్రమాదం నుండి తప్పించు కోవడం ఎంతో శ్రేయస్కరమన్నారు. .ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డిల చేతులమీదుగా కోవిడ్ నియంత్రణ సూచనల గోడ పత్రాలు విడుదల చేశారు.

ఎస్ఐ నాగచిరంజీవి సేవలు ప్రశంసనీయం
బదిలీపై వెళుతున్న ఎస్ఐకు ఘనసన్మానం

విశాలాంధ్ర-అట్లూరు : మండల ప్రజల ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరిచి పోలేనిది. వృత్తినే దైవంగా భావించి ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసిన ఎస్ఐ నాగచిరంజీవి సేవలు ప్రశంస నీయం (శభాష్) అని బద్వేల్ రూరల్ సీఐ హనుమంతనాయక్ అన్నారు. గురువారం బదిలీపై కర్నూలు వీఆర్‌కు వెళుతున్న ఎస్ఐ నాగచిరంజీవికి అట్లూరు సచివాలయం మహిళా పోలీసు సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అట్లూరు మండలం నుండి వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎస్ఐ నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. కడప జిల్లాలో అట్లూరు మండలం నుండి ఫ్రెండ్లీ పోలీసుగా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించారన్నారు. ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది ఎస్ఐ నాగచిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మైదుకూరు అర్బన్ నుండి సికె రాజుకు అభినందనలు తెలిపారు. చివరగా బదిలీపైవెళుతున్న ఎస్ఐ నాగచిరంజీవి మాట్లాడుతూ అట్లూరు మండల ప్రజలు తనపై చూపిన ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరువలేనిదన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ప్రశాంత వాతావరణం కొనసాగించేలా ప్రజలు కూడా సహకరించారన్నారు. యువత కూడా చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు, యువతకు భావోద్వేగ సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్, స్ఐ వెంకటయ్య, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, రమణ, నాగేంద్ర, వెంకటేష్, మహిళా పోలీసులు వాణి, హరిత, ఇంద్రావతి, మౌనిక, అనుష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు

విశాలాంధ్ర-పీలేరు: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ని రానున్న ఎన్నికల్లో ఓడించేందుకు లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని, బీజేపీ విధానాలను వ్యతిరేకించే లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని,మతతత్వానికి వ్యతిరేకంగా అందరూ కలిసి రావాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు కోరారు.గురువారం పీలేరు పట్టణంలోని షఫీ కళ్యాణ మండపంలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు జరిగే సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను నరసింహులు ప్రారంభించారు.ఈ సందర్భంగా పి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను ఊడకొడుతున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ చూసినా భూ మాఫియా పెరిగిపోయిందన్నారు. అధికార పార్టీ నేతలే ప్రభుత్వ అండదండలతో ప్రభుత్వ భూములను ఆక్రమణ చేస్తూ, ప్రతిపక్ష నేతలపై, ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. జిల్లాలో భూ మాఫియా, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా, అక్రమాలపై, జిల్లా వ్యాపితంగా ఆందోళనలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, జ్యోతి చిన్నయ్య, విశ్వనాథ్ నాయక్, సుదీర్,మురళి, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మిట్స్‌లో అధ్యాపకులకు విద్యార్థులకు ఇంట్రాక్షన్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె నందు అధ్యాపకులకు మరియు విద్యార్థులకు ఇంటరాక్షన్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్ట్రేలియాలోని మాక్వారీ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న డాక్టర్ సుభాస్ ముఖోపాధ్యాయ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వివిధ రంగాలలో ఉపయోగపడుతున్నదని అన్నారు. అందులో ఇంటర్నెట్ ఆఫ్ మెడికల్ థింగ్స్ అనేది ఆన్‌లైన్ కంప్యూటర్ నెట్‌వర్క్‌ల ద్వారా హెల్త్‌కేర్ ఐటీ సిస్టమ్‌లకు కనెక్ట్ చేసే వైద్య పరికరాలు మరియు అప్లికేషన్‌ల సేకరణ జరుగుతున్నదని ఆయనన్నారు. వైద్య పరికరాలు ఐఓఎంటికి ఆధారమైన మెషిన్-టు-మెషిన్ కమ్యూనికేషన్‌ను అనుమతిస్తాయి అని, ఐఓఎంటి పరికరాలు అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లకు లింక్ చేయబడతాయి, వీటిలో సంగ్రహించబడిన డేటా నిల్వ చేయబడుతుంది మరియు విశ్లేషించబడుతుంది అని అన్నారు. ఐఓఎంటి ని హెల్త్‌కేర్ ఐఓటీ అని కూడా అంటారు అని అన్నారు. ప్రస్తుతం ఐఒటి, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ తదితర అంశాలపై పరిశోధనల జరుగుతున్నాయన్నారు ఈ కార్యక్రమం లో 150 మంది విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొని ఫ్యూచర్ హెల్త్‌కేర్ సిస్టమ్‌పై జ్ఞానాన్ని పొందారు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ శ్రీమంత బసు, డీన్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ గౌతమ్ చక్రవర్తి, వేణుగోపాల్ చౌదరి, హెడ్ ట్రైనింగ్ అండ్ ప్లేసిమెంట్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్డెన్ వ్యాలీలో గ్లోబల్ రీసెర్చ్ మరియు ఇన్నోవేషన్‌పై శిఖరాగ్ర సమావేశం

విశాలాంధ్ర-కురబలకోట : అంగళ్లు సమీపంలోని గోల్డెన్ వ్యాలీ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ నందు ఈనెల 29 మరియు 30వ తేదీ గ్లోబల్ రీసెర్చ్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2022 ఆర్‌జెఎస్ ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నది. ఈ కార్యక్రమానికి మొదటి రోజు డాక్టర్ ఎస్ శ్రీధర్ చీఫ్ సైంటిస్ట్ ఐఐసిటి డాక్టర్ కె ఎస్ గుప్తా చైర్మన్ కె ఎస్ జి సెంటర్ ఫర్ క్వాలిటీ మైండ్స్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్ కేఎస్ గుప్తా మాట్లాడుతూ విద్యార్థుల యొక్క మైండ్ సెట్ గురించి విద్యార్థులు సానుకూల దృక్పథం తో ముందుకెళ్లాలని మరియు నెగెటివిటీని తగ్గించాకోవాలని చెప్పారు. డాక్టర్ ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ సాంకేతికత మరియు ఆవిష్కరణ వలన భారతదేశం మనుగడ సాగించుచున్నది. ఆర్ జె ఎస్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫౌండర్ డైరెక్టర్ మరియు సీఈఓ ఎస్ రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ అధ్యాపకులకి మరియు విద్యార్థులకు పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడం మేకాక ఈ సమ్మె యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, కళాశాల అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ వాసు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. శ్రీనివాసులు రెడ్డి ఎంబీహెచ్వోడి డాక్టర్ మీనాజ్,ఈసీఈ ఎచ్ఓడి డాక్టర్ నాగజ్యోతి, డిప్లమా ప్రిన్సిపల్ ప్రవీణ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గోడల నిర్మాణాలకు భూమి పూజ చేసిన ఎంఎల్‌ఏ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : రూ. 20 లక్షల ఎంపి ల్యాడ్స్ నిధులతో లక్కిరెడ్డిపల్లెలో ఈద్గా ప్రహరీ గోడ, ముస్లిం స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణాలకు ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి భూమి పూజలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలోని ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 15 లక్షలు, ముస్లిం స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణాలకు రూ.5 లక్షల నిధులను ఎంపి మిథున్ రెడ్డి నిధులను ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి మంజూరు చేయించారు. గురువారం ఆ పనులకు భూమి పూజలను ఎంపిపి మద్దిరేవుల సుదర్శనరెడ్డి, మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్యలతో కలసి శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపిటిసి దస్తగిరి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మసీదు కమిటీ ముతావలీ, సయ్యద్ ఖలీల్, ఖాన్‌బాష, ప్రభుత్వ సర్కారాజీ ముక్తార్ అహమ్మద్, సయ్యద్ ఏజదానీ బాష, నాసిర్ అహమ్మద్, జాకీర్, ఖాజా, నబీ, బాబ్జి, అబ్దుల్ జబ్బార్, అన్వర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, ఎంపి మిథున్ రెడ్డిలకు నియోజకవర్గపరిధిలోని ముస్లిం ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త వేరియంట్ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఓమి క్రాన్ బిఎఫ్7 కొత్త వేరియంట్ వైరస్ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరమని స్టేట్ కిసాన్ మోర్చా అగ్రికల్చర్ సెల్ కన్వీనర్ తోట శ్రీనివాసులు స్థానికులకు సూచించారు. గురువారం తన సొంత ఖర్చులతో పాస్పోర్ట్ కార్యాలయం వద్ద స్థానికులకు మాస్కులు ఉచితంగా అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి సామాజిక దూరాన్ని పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఉచిత మాస్కు లు పంపిణీ పట్ల పాస్పోర్ట్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఎస్ఎస్ మూర్తి, అసిస్టెంట్ సుబ్రమణ్యంరాజు బిజెపి కార్యకర్తలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఓబీసీ మోర్చా స్టేట్ సెక్రటరీ బత్తల సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊటుకూరు చలపతి, మల్రిపల్లి బాబుఆచారి, కార్యకర్తలు మురళి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నందలూరు పంచాయతీని అభివృద్ధి పరచాలి

విశాలాంధ్ర-నందలూరు :: నందలూరు గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి పరచాలని సర్పంచ్ మోడపోతుల సుభాషిణి, ఉప సర్పంచ్ సయ్యద్ ఇబ్బులు అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందలూరు అంగన్వాడీ కేంద్రం వద్ద నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని, వీధులలో డెంగ్యూ జ్వరం ప్రబలకుండా పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వాలంటీర్లు, వార్డు మెంబర్లు గ్రామంలోని సమస్యలను పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు,సురేష్ కుమార్, సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు:శ్రీకాంత్ రెడ్డి

సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశంలోఎమ్మెల్యే

విశాలాంధ్ర-గాలివీడు : అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా పార్టీలు,వర్గాలు, మతాలకు చోటివ్వకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలును సీఎం జగన్ అందిస్తున్నారని ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన గాలివీడులో గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశాలలో ముఖ్య అతిధిగా ఆయన పాల్గొన్నారు.ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మూడన్నరేళ్ల జగన్ పాలనలో అర్హులందరికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాలలో రూ.2లక్షల కోట్ల నిధులు జమ చేయడం ఒక చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయే సమయానికి రాష్ట్రంలో 39 లక్షల పెన్షన్లును మాత్రమే ఇచ్చేవారని, జగన్ అధికారం చేపట్టిన మూడన్నరేళ్ల పాలనలో ఆ పెన్షన్లను రెండింతలు చేసారన్నారు. కుట్రలు, కుతంత్రాలుతో చంద్రబాబు అధికారంలోకి రావాలని చూస్తున్నారని, అది జరగని పని అని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో బిసిలను ఓట్లకోసమే వాడుకున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాలలో యాభై శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా పక్షపాతిగా సీఎం జగన్ పేరొందారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు కరీముల్లా, మండల వైస్ ఎంపిపి మిట్టపల్లె యదుభూషణ్ రెడ్డి, జెడ్‌పిటిసి కుమారుడు ఎస్‌కె ఖాదర్ మోహిద్దీన్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవమ్మ, సర్పంచులు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవ రెడ్డి,దీప్తి వెంకటాద్రి, బాబా ఫక్రుద్దీన్, ఉమా ప్రభాకర్, మల్లికార్జున నాయుడు,మాజీ ఎంపిపి బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి, గుమ్మా అమరనాథ రెడ్డి,ఎంపీటీసీలు అమానుల్లా, జనార్ధన రెడ్డి, గాలి శ్రీనివాసులు, చంద్రప్రకాష్ రెడ్డి, నాయకులు భానుమూర్తి రెడ్డి,హరినాథ రెడ్డి, నాగభూషన్ నాయుడు పాల్గొన్నారు.

రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి:కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యక్రమం వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులకు సూచించారు. గురువారం విజయవాడలోని సిసిఎల్‌ఏ కార్యాలయం నుండి సంబందిత శాఖల కార్యదర్శులతో కలిసి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యాచరణ, అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్ లు, జేసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్, డిప్యూటీ తహసిల్దార్ క్రాంతి కుమార్, రీసర్వే అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వే కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని జిల్లాలో సర్వే టీం సభ్యులు నిబంధనల ప్రకారం సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ వివాదాలను పరిష్కరించడం అన్నది సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఆ దిశగా సమగ్ర సర్వేను నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయడానికి అధికారులు కృషి చేయాల న్నారు. అన్నమయ్య జిల్లాలోని రీ సర్వేకు సంబంధించిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక నేరాలపై ఎస్పీ సమీక్ష

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్ ను పటిష్ట పరచి ప్రజల సహకారంతో శాంతి భద్రతలను స్థిర పరచడం జరిగినది. పోలీసింగ్ నందు సాంకేతికతకు పెద్దపీట వేస్తూనేర నిరూపణలో ఉపయోగించుకోవడం జరిగినది. మహిళా పోలీసులతో 6,144 అవగాహనా సదస్సులు నిర్వహించి మహిళలు మరియువిద్యార్థినీ, విద్యార్థులను చట్ట పరంగా చైతన్య పరచడమైనది. 74 బాల్య వివాహాలను అడ్డుకోవడం జరిగినది, 65 ఈవ్టీసింగ్, చైల్డ్అబ్యూస్నెషల్ డ్రైవ్స్‌ను నిర్వహించారు. స్పందన ద్వారా 1491 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో 1369 పరిష్కరించబడినవి. ఎర్రచందనం అక్రమ రవాణా చేసే 04స్మగ్లర్ల పై కేసు నమోదు చేయబడినది. జిల్లాలో 4లక్షల 50వేల 297 మంది దిశా ఆప్ ను డౌన్లోడ్ చేసుకున్నారు.

అన్నమయ్య జిల్లా పోలీసు వారి వార్షిక నివేదిక:

అన్నమయ్య జిల్లా పోలీసు వ్యవస్థ శాంతి భద్రతలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాడంలో ఎల్ల వేళల, నిరంతరం శ్రమిస్తూ నేరాలను అరికట్టడంలో తనదైన పద్ధతిలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందింది. అన్నమయ్య జిల్లా పోలీసు వ్యవస్థ సాంకేతిక పరంగా అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొంటూ ప్రజల రక్షణకు మరియు సేవకుమరింత చేరువవ్వుటకు సన్నద్ధం అవుచున్నది. విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా, ప్రత్యేక కార్యాచరణలు చేపట్టి జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై ఎన్ఫోర్స్మెంట్ ను అమలుపరచారు. 2022 వ సంవత్సరం నందు సాధించిన ఫలితాలగురించి వివరించారు.

కంబారయుడుస్వామి తిరునాళ్ళ

విశాలాంధ్ర-చిట్వేలి : మండలంలోని స్థానిక కంపసముద్రం పంచాయతీలోని గుడ్లవారిపల్లి వద్ద వెలసి ఉన్న శ్రీ కంబా రాయుడు స్వామి తిరునాళ్ళ కార్యక్రమం జనవరి నెల ఒకటవ తేదీ ఆదివారం నాడు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆదివారం ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు అలంకారాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారినీ దర్శించి కాయ కర్పూరము సమ ర్పించి మొక్కులు తీర్చుకొనగలరని కమిటీ పెద్దలు తెలియజేశారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం :ముప్పాల



విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పాలెంకోట మణి కుటుంబానికి అండగా ఉంటాం, ఆందోళన చెందవద్దని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ముప్పాల హెమనవర్మ భరోసా ఇచ్చారు. అనంతరాజుపేట గ్రామపంచాయితీ పరిధిలోని రామయ్యపాలెం ఎస్టీ కాలనీ చెందిన పాలెంకోట మణి గుండె పోటుతో మరణించాడు.తన అనుచరుల ద్వారా విషయం తెలుసుకున్న హెమనవర్మ హుటాహుటిన రామయ్య పాలెం ఎస్టీ కాలనీకి బయలుదేరి వెళ్ళి భౌతిక కాయంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు.జెట్పిటిసి పాలెంకోట రత్నమ్మ,సాయి కంప్యూటర్ అధినేతకంపరాజు నాగేంద్రరాజు, జయచంద్ర రాజు, గిరిజన నాయకులు పాలెంకోట చంద్రయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

గట్కా జాతీయ ఛాంపియన్ షిప్‌లో గౌతమ్ విద్యార్థులు



విశాలాంధ్ర-గాలివీడు: జాతీయ ఛాంపియన్ షిప్ గట్కాలో గౌతమ్ పాఠశాల నుండి నలుగురు,రవిచంద్ర పాఠశాల నుండి ఒక్కరు పాల్గొన్నారని యాజమాన్యం షింటో ఇమ్మానియల్,సైజు థామస్‌లు తెలిపారు. డిసెంబర్ 23, 24,25 తేదీల్లో పంజాబ్ విశ్వవిద్యాలయం చండీగఢ్ లో నిర్వహించిన 10 వ జాతీయ ఛాంపియన్ షిప్ గట్కాలో తమ పాఠశాలల నుండి భరత్ కుమార్,లక్ష్మీ నరసింహ,అఖిల్ కుమార్, అభిషేక్, షైక్ షమీల్ పాల్గొని ప్రతిభ కనబరచి మెమొంటో, ప్రశంశా పత్రాన్ని అందు కున్నారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యా ర్థులను, వ్యాయమ ఉపాధ్యాయున్ని పాఠశాల యాజ మాన్యం సత్కరించారు.

గోవింద మాలాదారులకు అన్నదానం

విశాలాంధ్ర-సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలోని గోవింద మాలధారణ బక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరుతుండగా దాదాపు 1000 మంది గోవింద భక్తులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు భక్తులకు అన్నదానాన్ని మార్గమధ్యము లోని యర్రవారిపాలెంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శివరాం నాయుడు, చంద్రశేఖర్ రాజు, మస్తాన్, సురేష్ నాయుడు, బాబు నాయుడు, హరినాథ్, హరి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరం

విశాలాంధ్ర-రామాపురం : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని ఎస్సై కొండారెడ్డి తెలిపారు.అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఆరు బహిరంగ ప్రదేశాలలో బోర్డులు ఏర్పాటు చేసినట్లుఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నల్లగుట్టపల్లి సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి సహకారంతో బోర్డులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడం బహిరంగ ప్రదేశాలలో కాలిబాటల్స్ పగలగొట్టడం ఇలాంటివి నేరమన్నారు. చట్టానికి అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబులు ప్రతాప్, ఎస్ఎండి రఫీ, మహేశ్వరయ్య, గంగయ్య, దూదేకులపల్లి యూత్. తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల అవకతవకలలో రికవరీకి ఆదేశం

ఉపాధి సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనికి బహిరంగ ప్రజా వేదికను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఉపాధి పి.డి మద్దిలేటి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం 2019 సంవత్సరం 2020-21కి గాను సామాజిక తనిఖీ బహిరంగ సమావేశములో మండల వ్యాప్తంగా 26,కోట్ల 47, లక్షల రూపాయలను వినియోగించినట్లు పేర్కొన్నారు. మొత్తం పనులు 15 50 పరిధిలో ఉన్నాయని అలాగే ఉపాధి హామీలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించి జిల్లా అధికారి పిడి మదిలేటి రికవరీకి ఆదేశించారు. రోడ్డుపక్కల చనిపోయిన చెట్లను తిరిగి నాటించాలని ఆదేశించారు. అదేవిధంగా మండలానికి ఆకస్మికంగా తనిఖీ చేస్తానని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీ డి రవికుమార్, ఎంపీడీవో రామచంద్రతో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, రైతులు ఉపాధి కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద మసీద్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పెద్ద జామియా మస్జీద్ అభివృద్ధి కొరకు గురువారం జామియా మస్జీద్ మూతవల్లీ ధర్మకర్త జనాబ్ సయ్యద్ షబ్బీర్ అహ్మద్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా షేక్ అహమ్మద్ బాష, ఉపాధ్యక్షులుగా షేక్ గులాంబాష, కార్యదర్శిగా పఠాన్ మౌలా, సంయుక్త కార్యదర్శిగా షేక్ హఫీజుల్లా, కోశాధికారిగా షేక్ జుబేర్,కార్యవర్గ సభ్యులుగా షేక్ కరీముల్లా, మస్తాన్ సాహెబ్, మహమ్మద్ రఫీ, మహమ్మద్ భాష, మహమ్మద్,మిర్జాఆలీ,జాకీర్ హుస్సేన్,షాన్ వాజ్,సయ్యద్ సలీం తదితరులను అందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.పెద్ద మస్జీద్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర-కెవిపల్లి: కెవిపల్లి మండలంలోఅన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు టాబ్ ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతల రామచంద్రారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదివే 8 వ తరగతి విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకి ఉచితంగా టాబ్ లను పంపిణీ చేయడం జరిగిందని తెలియచేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందురు సద్వినియోగం చేసుకుని భవిష్యత్ లో ఉన్నతస్థాయికి వెళ్ళాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యశాఖాధికారి రెడ్డి బాష, ఎంపీపీ ఈశ్వరమ్మ, జడ్పీటీసీ శృతి సర్పంచులు, ఎంపిటీసిలు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిదులు, అన్ని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు విద్యార్థులు, తల్లి తండ్రులు మరియు సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణ కార్డులు అందరికీ ఇవ్వాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : మాతా శిశు సంరక్షణ కార్డులు ప్రతి గర్భవతి వద్ద ఉండాలని డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ వసీం అక్రమ్ పేర్కొన్నారు. గురువారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై అన్ని గ్రామ సచివాలయాల్లో మాత శిశు సంరక్షణ కార్డులు నమోదు చేసి గర్భవతులు బాలింతలు రికార్డులు ఖచ్చితంగా ఉండాలన్నారు. మూడు నెలల గర్భవతి అయినప్పటి నుంచి కార్డు తప్పనిసరిగా అందించాలన్నారు. తల్లి బిడ్డ క్షేమాలు బాలింతలకు అందాల్సిన టీకాలు సకాలంలో అందించి కార్డులో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి గర్భవతుల ఇమ్యునైజేషన్ గర్భవతుల ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రవీంద్ర ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నందలూరులో ఫాగింగ్

విశాలాంధ్ర-నందలూరు :: మండలంలోని నందలూరు పంచాయితీ పరిధిలో సర్పంచ్ మోడపోతుల సుభాషిణి ఆధర్యంలో దోమల నివారణకు, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు రసాయన ద్రావణాలు పిచికారి చేసి ఫాగింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలలో నీటిని నిల్వ వుండకుండా చూడాలని, పంచాయితీలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ

విశాలాంధ్ర-నందలూరు :: మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన బైజూస్ ట్యాబ్ లను ఎంపీపీ మేడ విజయ భాస్కర్ రెడ్డి 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ప్రభుత్వ ఉద్దేశ్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ షేక్ మైనుద్దీన్, వైసీపీ నాయకులు మంచా మురహరి, ఎస్.కె షావలి, ఉపాధ్యాయులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో మట్టి రోడ్డు పనులు



విశాలాంధ్ర-రామసముద్రం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి సహకారంతో మట్టి రోడ్డు పనులు చేపడు తున్నట్లు వైసిపి నాయకుడు నరసాపురం తిమ్మయ్య తెలిపారు . మండలంలోని దిన్నిపల్లె వద్ద నుండి మోరుకొండ వరకు ఐదు లక్షలతో మట్టి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ నుండి 5 లక్షల రూపాయలతో వర్షానికి దెబ్బతిన్న మట్టి రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ రోడ్డు పనులు చేపట్టడం వల్ల కస్తూర్బా ఆదర్శ పాఠశాల మోర్ కొండపల్లి భక్తులకు విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలించిన ఆర్‌ఎం

విశాలాంధ్ర-బి.కొత్తకోట: ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను అన్నమయ్య జిల్లా ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ గురువారం బి.కొత్తకోటలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయు స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బి కొత్తకోటలో ఆర్టీసీ డిపో బస్టాండ్ చాలా అవసరం అన్నారు బి కొత్తకోట మండలానికి చుట్టుపక్కల ఎక్కువ గ్రామాలు కర్ణాటక బార్డర్ ఉండడంతో ఆర్టీసీ డిపో బస్టాండ్ కి అనువైన స్థలంగా బి కొత్తకోట గుర్తించడం జరిగిందన్నారు. పిటీఎం రోడ్డులోని స్థలమును పరిశీలించిన ఆయన ఆర్టీసీ డిపో బస్టాండ్ అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రస్తుత ఆర్టీసీ బస్సులు నిలుస్తున్న గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరకు వచ్చి విద్యార్థులతో మీరు ఏ ఊరికి వెళ్లాలి బస్సు ఏ సమయానికి వస్తుంది బస్సులు సమయపాలనకు వస్తున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ బస్సులు సమయపాలనకు రాకపోతే సమయానికి బస్సులు నడవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మదనపల్లి ఆర్టీసీ డిఎం వెంకటరమణ రెడ్డికి సూచించారు. ఆయన వెంట ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు

సిసి రోడ్డుపై అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

విశాలాంధ్ర-గుర్రంకొండ : మండలంలోని ఏల్లుట్ల గ్రామం నల్లగుట్టపల్లి హరిజనవాడలో వేసిన సిసి రోడ్డుపై అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్వర్యంలో బస్టాండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా సహాయ కార్యదరి రమణా రెడ్డి గ్రామస్తులతో కలిసి డి టి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణం పై సంబందిత అధికారులు స్పందించి ప్రజల రాక పోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని , నల్ల గుట్ల పల్లి హరిజనవాడనందు గ్రామ పంచాయతీ వేసిన సిసి రోడ్డు పై నల్లగుట్ల పల్లి కి చెందిన కొంత మంది గోడ నిర్మాణం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో నాయకులు విశ్వనాథ్, పూస పాటి రమణ, ఈశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, మల్లయ్య, వెంకటరమణ రెడ్డి, శ్రీనివాసులు, అక్కులప్ప, రత్నమ్మ, మల్లయ్య, అప్పుల రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రియుని చేతిలో నయవంచనకు గురైన ప్రియురాలు

పెళ్లి చేసుకోలేదని మనస్థాపంచెంది ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మదనపల్లి : నువ్వు లేకుంటే నేను లేనన్నాడు.. నా బతుకు.. నా సర్వస్వం నీవే అన్నాడు.. ప్రేమిస్తున్నానని వెంటపడి బ్రతిమలాడాడు.. నిజమేనని నమ్మి వెంట వెళ్లిన యువతిని ఏడాది పాటు ఊరు గాని ఊరిలో వేరు కాపురం పెట్టి.. సహజీవనం సాగించాడు.. ఇప్పుడు ఇంట్లో పెద్దలు ఒప్పుకోవడం లేదు.. నిన్ను పెళ్లి చేసుకుంటే నాకు కష్టాలు తప్పవని తీసుకొచ్చి తిరిగి మదనపల్లిలో వదిలిపెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఉండి పోయాడు. ప్రియుడి చేతిలో నయవంచనకు గురైన ఆమె దిక్కు తోచని స్థితిలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటోంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... పట్టణంలోని తొట్టి వీధికి చెందిన మహబూబ్ బాషా భార్య షాహిన 25, భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో సాహినాను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. సెల్ ఫోన్లో చాటింగులు, మెసేజ్లు పెట్టడమే కాకుండా గంటల తరబడి ఏకాంతంగా మాట్లాడేవాడు. చివరకు వాని మాయలో పడ్డ ఆమె పెళ్లి చేసుకుంటానని నమ్మించ దంతో ఏడాది కిందట కదిరికి వెళ్ళింది. వారి స్వగ్రామంలో తల్లి దండ్రులకు తెలియకుండా వేరే రూము అద్దెకు తీసి సహజీవనం సాగించాడు. విషయం ఇంట్లో వరకు తెలియడంతో పెళ్లి చేసుకోవడం కుదరదని తేల్చి చెప్పాడు. అంతటితో ఆగకుండా బుధవారం తీసుకొచ్చి ఆమెను మదనపల్లిలో వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ప్రియుడు చేతిలో నయవంచనకు గురయ్యానని తీవ్ర మనోవేదనకు గురైన ఆమె మనస్థాపం చెంది జీవితంపై విరక్తితో ఇంట్లో ఉన్న ఫినాయిల్ విషం కలిపి తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ఆమెకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటోంది. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరు -శ్రీశైలం -అనంతపురం బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతల

విశాలాంధ్ర - పీలేరు: బుధవారం అట్టహాసంగా స్థానిక పీలేరు డిపో కార్యాలయం నుండి నూతన సర్వీసులు అయిన శ్రీశైలం అనంతపురం సర్వీసులను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ నూతన సర్వీసులు ప్రారంభించడానికి ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి అత్యంత కృషి చేయడం వలన ఈ సర్వీసులను ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు పీలేరు ఆర్టీసీ డిపోను ఆధునీకరించడానికి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని అన్నారు నూతనంగా ప్రారంభించిన ప్రవేశ పెట్టిన ఈ సర్వీసుల మూలంగా శ్రీశైలం సర్వీస్ను పీలేరు ప్రాంత ప్రజలు విశ్రాంత ఉద్యోగులు భక్తాదులు సద్వినియోగం చేసుకున్నందుకు ప్రయాణికులు ముందుకు రావాలని పోర్ట్ డైరెక్టర్ తో పాటు పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో పీలేరు డిపో నుంచి త్వరలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిద్దున్ రెడ్డి సహాయ సహకారాలతో మరిన్ని సర్వీసులను ప్రవేశపెడతామని తెలిపారు..ఈకార్యక్రమం లో మాజీ శాసన సభ్యులుజి.వి. శ్రీ నాథ రెడ్డి, పీలేరు సర్పంచి హబీబ్ బాషా,బోర్డు డైరెక్టర్ ఎ. రాజారెడ్డి, పుర ప్రముఖులు, హరినాథ్ రెడ్డి, గ్యారేజ్ ఇంఛార్జి, సుధాకర్ నాయక్, రెడ్డెప్ప, ట్రాఫిక్ సూపర్వైజర్లు, అసోసియేషన్ నాయకులు, పి.యస్.యం.రాజు, రమణ, చంద్ర శేఖర్ అజాద్, మధుసూధన్ గరవయ్య, కండక్టర్లు, డ్రైవర్ సోదరులు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు

కందుకూరు ప్రమాద దుర్ఘటన చాలా దురదృష్టకరం

విశాలాంధ్ర-నందలూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు లో తెలుగు దేశం పార్టీ సభ జరుగు తుండగా చోటు చేసుకున్న తొక్కేసులాటలో 8 మంది మృతి చెందడం, మరికొం దరు ఆసుపత్రి పాలు కావడం చాలా దురదృష్ట కరమనిరాజంపేట అగ్రికల్చ ర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకైనా కార్యకర్తలే వెన్నుదన్ను, మూల స్తంభాలు, కార్యకర్తలు ప్రమాదాల బారిన పడి టీడీపీ కార్యకర్తలు మృతి చెందడం చాలా విచారకరమని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియ తెలియజేస్తున్నానని అన్నారు. ఆసుపత్రి పాలైన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

శవరాజకీయాలు చేయడం వైసీపీకి అలవాటు: టిడిపి

విశాలాంధ్ర-నందలూరు : శవ రాజకీయాలు చేయడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అలవాటేనని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ళ సుబ్బరాయుడు అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చెంగల్ రాయుడు సూచన మేరకు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం గట్టుమీద పల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న కందుకూర్ లో జరిగిన చంద్రబాబు నాయుడు రోడ్ షో జనాలు ఎక్కువ సంఖ్యలో రావడంతో జరిగిన తొక్కిసులాట లో 8 మంది టిడిపి కార్యకర్తలు చనిపోవడం జరిగిందన్నారు. వాటిని కూడా వైకాపా నాయకులు రాజకీయం చేయడం దుర్మార్గం అన్నారు. గతంలో కూడా జగన్ సభలో ఇలాంటి సంఘటన జరిగాయని గుర్తు చేశారు. మా కార్యకర్తలను పోగొట్టుకొని మేము బాధపడుతుంటే దాన్ని కూడా రాజకీయాలు చేయడం నీచమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకొని సీఎం కుర్చీ కోసం సంతకాలు సేకరించింది ఎవరో ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. ఇంత నీచ రాజకీయాలు ఎన్నడూ చూడలేదన్నారు. ఈరోజు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వాటిని గాలికి వదిలేసి శవ రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గట్టుమీద పల్లి గ్రామ అధ్యక్షులు బాల నరసింహులు, బూత్ కన్వీనర్ నాగరాజు, బీసీ సెల్ పార్లమెంట్ కార్యనిర్వాహ కార్యదర్శి చుక్క యానాది, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యపానం నేరం

విశాలాంధ్ర-నందలూరు : బహిరంగ ప్రదేశాలలో మద్యపానం నేరమని ఎస్సై మైనుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, పై అధికారుల ఉత్తర్వులు మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రదేశాలను గుర్తించి సంబంధిత పంచాయతీ సెక్రటరీస్ అయిన నందలూరు, నాగిరెడ్డిపల్లి పంచాయతీ సెక్రెటరీకి సదరు ప్రదేశాలను శుభ్రం చేయవలసిందిగా నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే శుభ్రం చేసిన తర్వాత సదరు ప్రదేశాల నందు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించరాదని బ్యానర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరు కూడా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించ రాదు అలా కాదని సేవించిన ఎడల వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో 'తానా'
ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో భాగంగా తానా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లోకేష్ కొణిదల ఆధ్వర్యంలో నిరుపేదలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్ళు, స్కాలర్షిప్లు అందజేశారు. ముఖ్యఅతిథి తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి మాట్లాడుతూ 46 ఏళ్లుగా 72 వేల మంది సభ్యులతో తానా ఉత్తర అమెరికాలో తెలుగు వారికి సేవలు అందిస్తోంది అన్నారు. డిసెంబర్ రెండవ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో తానాచైతన్య స్రవంతి కార్యక్రమంలో భాగంగవిద్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ప్రజలు ప్రతి ఏటా రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చుకోవాలని తానా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లోకేశ్ కొణిదల పేర్కొన్నారు. గురువారం స్థానిక శేషసాయి కళ్యాణమండపం వద్ద తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనిం 'గ్ పరీక్షలు, బీపీ, మధుమేహం, బీఎంఐ, మ్యామోగ్రఫి పరీక్షల ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ తానా ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇలాంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాలు కూడా పేద ప్రజలకు సౌకర్యంగా వుండేలా ఆధునికి పరికరాలతో ప్రతి ఏటా రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు వారికి వీలైన చోట్ల క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 486 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెరవలి నవీన్, ప్రశాంత్, నిరంజన్ నాని ఇందులో భాగంగా మదనపల్లిలో గ్రేస్ ఫౌండేషన్ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, ఉచిత శిబిరం నిర్వహిస్తున్నాము అన్నారు. దీంతోపాటు ఉచిత వైద్య పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తున్నాము అన్నారు. కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన, తానా మహాసభల నిర్వాహకులు రవి పొట్లూరి, సునీల్ పత్రా, తెలుగుదేశం పార్టీ నాయకులు పెరవలి నవీన్, నిరంజన్ నాని, ప్రశాంత్, రాజేష్ పాల్గొన్నారు.

సింగల్ విండో అధ్యక్షుడిని పరామర్శించిన ఎంఎల్ఏ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమండెం సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి అనారోగ్యానికి గురై,బెంగుళూరు లో చికిత్సపొంది ఇంటివద్ద విశ్రాంతి పొందు చున్నారు. గురువారం రెడ్డివారిపల్లెలో గోవర్ధన్ రెడ్డిని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డిలు, తొగట వీర క్షత్రియ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ లు పరామర్శించి ఆరోగ్య పరిస్తితులునడిగి తెలుసుకున్నారు.

కందుకూరులో అపశ్రుతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన మన కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటు మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. చంద్రబాబు నాయుడు గారు స్వయంగా హాస్పిటల్ కి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు. వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కందుకూరు బహిరంగ సభ సంతాప సభగా మారడం అత్యంత బాధకర అన్నారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి వతన్ నిసార్ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి హుస్సేన్, మాజీ వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల లక్ష్మీ ప్రసాద్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన మండిపల్లి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం గంగిరెడ్డి గారి పల్లె కు చెందిన చల్లపల్లి రమణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రమణ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గుండె కు బైపాస్ సర్జరీ చేయాలని రాముడు దృష్టికి తీసుకొచ్చారు.ఆ మేరకు రాముడు స్పందించి కర్నూలులోని వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని తెలియజేశారు. అనంతరం రమణ ను కర్నూలు లోని ఆసుపత్రికి వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తన సహకారం ఎల్లప్పుడు వుంటుందని బాధితునకి అయన బరోసా కల్పించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి తోడ్పాటునిస్తానని అన్నారు.

కందుకూరు ఘటన మృతులకు ప్రసాద్ బాబు నివాళులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: కందుకూరు ఘటనలో మృతిచెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ... మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు అశ్రునివాళులు అర్పించారు. గురువారం ఆయన కార్యాలయంలో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి ఆయన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నానన్నారు. కందుకూరులో టీడీపీ జాతీయ పార్టీ అధ్యక్షుడు శ్రీనారాచంద్రబాబు నాయుడు పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. పార్టీ మీద ప్రేమతో, అధినేత మీద అభిమానంతో కదలి వచ్చిన కార్యకర్తలను పోగొట్టుకున్నాం అన్నారు. తెలుగుదేశం అంటే ఒక కుటుంబం అని భావించే ప్రతి ఒక్కరికి ఇది పట్టరాని దుఃఖాన్ని కలిగిస్తోందన్నారు.మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మైనారిటీ నాయకులు ఇర్షాద్ ఖాన్,ఖలీల్,ఖాదర్ బాస్ సుగవాసి శ్రీనివాసులు,లాయర్ సతీష్ రెడ్డి, మన్నేరు రామాంజనేయులు,మాజీ కౌన్సిలర్ సహదేవ,బిడిశెట్టి రవి,రాజశేఖర్, ప్రసాద్ , అఫ్రోజ్, బాషా,ముత్తుకూరు రఫీ,వాకా వాసు,కిషోర్ చౌదరి, కరామత్,మనోహర్, శివ,ఆనంద్,రెడ్డి,రమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

31 నుండి కైవాలనంద స్వామి ఆరాధన ఉత్సవాలు

విశాలాంధ్ర-రామాపురం : అన్నమయ్య జిల్లా రామాపురం మండల కేంద్రంలో శ్రీ కైవలానంద స్వామి ఆరాధన ఉత్సవాలు ఈనెల 31వ తేదీ నుండి జనవరి ఒకటో తేదీ వరకు రెండు రోజులు పాటు జరుగుతాయి. శ్రీ కైవలానంద స్వామి 63వ ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. హిందూ ముస్లిం మత భేదాలు మరిచి మమతాను రాగాలతో ఈ ఉత్సవాలలో భక్తులు ప్రార్థనలు చేస్తారు. కుల మత భేదాలు ఈ ఆరాధన ఉత్సవాల్లో కనిపించవు. ఈ ఆరాధన ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొంటారు. ఈ ఉత్సవాలలో భజనలు కూడా హరికథలు చేస్తారు. 31 తేదీన జనవరి ఒకటవ తేదీన జరుగు కార్యక్రమాలకు భక్తులు హాజరుకావాలని ఆలయ కార్య నిర్వాహకులు తెలిపారు.

క్రీడలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: క్రీడలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.గురువారం మండల కేంద్రమైన చిన్నమండెంలో 66వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లాల (అండర్19) సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ మరియు ఎంపికలు ను జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, తొగటవీర క్షత్రియ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్ లతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత క్రీడాకారుల మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు.క్రీడాకారులును పరిచయం చేసుకున్నారు. పోటీల ప్రారంభ సందర్భంగా శాంతికి చిహ్నంగా పావురాలును ఎగురవేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ఉన్న చిన్నమండెంలో13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులుతో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు పండుగ వాతావరణంలో ప్రారంభం కావడం హర్షణీయమన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులలో క్రీడా నైపుణ్యం ఎంతో దాగుందన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసానికి ప్రతీకలన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలుపోటములును సమానంగా స్వీకరించాలన్నారు.రాష్ట్ర స్థాయి పోటీలుతో క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు.మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చిన్నమండెం మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ ,సిబ్బందిని ఆయన పేరుపేరునా అభినందించారు. మోడల్ స్కూల్ కు స్థలం ఇచ్చిన దాతలును ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ఏ పి స్కూల్ గేమ్స్ సెక్రటరీ భానుమూర్తిరాజు ,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ , పి ఈ టి రామాంజులు, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ,జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప , మండల ఉపాధ్యక్షుడు ఎజాస్ అలీ ఖాన్, ఎంపీటీసీలు రమేష్, వెంకటప్ప నాయుడు, శ్యామ్ చంద్ర, సర్పంచులు లోకేశ్వర్ రెడ్డి, నజీర్ అహమ్మదు,నజీర్ బాషా,జగన్నాథ రెడ్డి, లక్ష్మి రెడ్డి, దామోదర్,వైసీపీ నాయకులు బాబు రెడ్డి, నిరంజన్ రెడ్డి, సలీమ్, అన్వర్ బాషా, సాదిక్,జహీర్,సజద్, శేషా రెడ్డి, మహమ్మదు షరీఫ్, ఖదీర్ అహమ్మదు, వెంకీ,చిన్న రెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడా కారులు పాల్గొన్నారు

రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం

విశాలాంధ్ర - రామసముద్రం: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడుదామని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ మరియు మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని దౌర్జన్యాలతో పాలను కొనసాగిస్తూ అభివృద్ధిని మరచిపోయారని విమర్శించారు గురువారం ఇదేం కర్మ లో భాగంగా మండలంలోని చొక్కాడ్లపల్ పంచాయతీలో ఇదేం కర్మ నిర్వహించారు గడచిన బుధవారం నెల్లూరు లోని కందూరులో చంద్రబాబు సభలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు నివాళులర్పించారునెల్లూరు సిటీలో సిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోటమరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గారిని వారి ఇంటి దగ్గరే కారుతో ఢీకొట్టడం జరిగిందని నిన్న పుంగనూరులో రామచంద్ర యాదవ్ రైతు సమావేశం ఏర్పాటు చేస్తే దానిని ధ్వంసం చేసి వారి ఇంటి మీద దాడి చేయడం చాలా హేయమైన చర్య అది ప్రజాస్వామ్య వ్యతిరేకమని ప్రజాస్వామ్య వాదులు అందరు ఇటువంటివి ఖండించాలని చెప్పారు అదే విధంగా ప్రతిపక్ష పాత్ర ఈ ప్రభుత్వమే పోషిస్తున్నదని కర్నూలులో ఈరోజు హైకోర్టు కోసం న్యాయ రాజధాని చేయాలని వైసిపి సభను నిర్వహిస్తున్నదని ఒకవైపు సుప్రీంకోర్టులో అడ్వకేట్ జనరల్ అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని పిటిషన్ వేస్తే మరోవైపు ప్రజలను మభ్యపెడుతూ కేవలం ఎన్నికల కోసం ప్రజలలో ఏర్పాటు వాదాన్ని హింసవాదాన్ని భావోద్రేకాలను రెచ్చగొడుతున్నారని అదేవిధంగా మూడు రాజధానులు బిల్లును అసెంబ్లీలో ఉపసంహరించే తిరిగి మూడు రాజధానులు చేస్తారని చెప్పడం ప్రజలను వంచించడమే అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కోశాధికారి సీతప్ప మండల తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి కొండూరు నారాయణరెడ్డి మల్లికార్జున సోమశేఖర్ రెడ్డి వెంకటరమణ గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

తెలుగుదేశం సభలో మరణించిన వారికి సంతాపం

విశాలాంధ్ర- బి.కొత్తకోట: కందుకూరు నియోజవర్గంలో బుధవారం కేంద్ర టిడిపి పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభలో ప్రమాదవశాత్తు జరిగి జరిగిన ప్రమాదంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు 8 మంది మరణించారు మరణించిన వారికి తంబళ్లపల్లి నియోజవర్గం మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు బి. కొత్తకోటలో గురువారం సాయంత్రం జ్యోతి చౌక్ బస్టాండ్ నందు మాజీ సర్పంచ్ కూడా శ్రీనివాసు లు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రమాద శాతుమరణించిన వారి ఆత్మ శాంతి కలగాలని వారు ప్రార్థించారు ఈ కార్యక్రమంలో నాయకులు కనకంటి ప్రసాద్ దేవరఇంటి కుమార్ దేరంగుల నారాయణ షమీవుల్లా గంజి మోహన్ అంజి ఫిరోజ్ బాలాజీ గట్టు చంద్ర మగ్గం శివ. శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో వున్న శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ రెడ్డి కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంలో గత 22 సంవత్సరాల నుండి యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించిన ఘనత శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలకు దక్కుతుందని అభిప్రాయపడ్డారు .ఈ కళాశాల విద్యార్థిని విద్యార్థులు దేశ విదేశాలలో, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో, బ్యాంకింగ్ ,సాఫ్ట్వేర్, ఇస్రో వంటి సంస్థల యందు ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని తెలియజేశారు. ఈ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్స్ మరియు ప్రతిభా పురస్కారాలను అందుకొని కళాశాల స్థాయిని యూనివర్సిటీ స్థాయిలో ఇనుమడింప చేశారని పేర్కొన్నారు .ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్య సాధనకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, చదువుతున్న కళాశాలను మర్చిపోకూడదని పాఠాలు బోధించే ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు .క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలియజేశారు. అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ భరోసా కల్పిస్తూ అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ ,ఎంబీఏ విభాగాల యందు యూనివర్సిటీ పరీక్షల యందు ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాపికలను మరియు ప్రశంసా పత్రాలను బహూకరించి వారి తల్లిదండ్రులను సన్మానించారు . ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, డాన్స్ మరియు పాటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి కి బరోసా కల్పించిన బత్యాల చంగల్ రాయుడు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి రాజంపేట నియోజకవర్గం సుండుపల్లి మండలం బుర్రదిన్నెపల్లె హరిజనవాడ గ్రామ నివాసి గంగాపురం లక్ష్మీదేవి 1.47 ఎకరాలలో మూడు సంవత్సరాల ఉన్న 87 మామిడి చెట్లను అన్యాయంగా ఎస్సీ మహిళ లక్ష్మీదేవి పై దౌర్జన్యం చేసి కొద్దిరోజుల క్రితం చెట్లు నరికివేసిన విషయం మనందరికీ తెలిసినదే ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గురువారం నాడు లక్ష్మీదేవమ్మ ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనలు తెలుసుకొని వాటిపై ఆరా తీసి తెలుగుదేశం పార్టీ తరఫున మేమంతా మీకు అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కల్లె రెడ్డెప్ప, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక తాతినేని శివకుమార్ నాయుడు, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రేవూరి నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, వాణిజ్య విభాగం పార్లమెంట్ అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు చాన్ బాషా, గ్రామ కమిటీ అధ్యక్షులు చెన్నంశెట్టి సుబ్బారాము, రమణ, ఇస్మాయిల్, జక్రియ,లక్ష్మీ నరసయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలను నమ్మవద్దు - ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలను నమ్మవద్దని, నమ్మితే మోసపోతారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.గురువారం పుల్లంపేట మండలంలోని వత్తలూరు గ్రామసచివాలయ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో గోపంపల్లి, హరిజనవాడ, మల్లెంవారిపల్లి గ్రామాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారి పింఛన్లు తొలగించలేదు, సామాజిక తనిఖీలు మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ సమీక్షేమ పథకాలు పొందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకుంటూ నవరత్నాలు కలిగిన బుక్ లెట్ ను అందజేసి స్థానికులలో చైతన్యం తీసుకువచ్చారు.పింఛన్లు యధావిధిగా వస్తాయి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టారు.రాజంపేట డిఎస్పి శివభాస్కర్ రెడ్డి, తాసిల్దారు నరసింహారావు, ఎండిఓ ప్రకాష్, సిఐ పుల్లయ్య, ఎస్సై సుబ్బారెడ్డి,వైసిపి స్టేట్ ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, జెడ్పీటీసీ రామనాథం, ఎంపిటిసి వాణి, ఎమ్మెల్యే పిఎస్ ఎంసి కృష్ణయ్య,మండల ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపిటిసి సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, శంకరెడ్డి, మల్లికార్జున, నాగేశ్వరరావు, నలినికుమార్ రెడ్డి, కేశవరెడ్డి, గ్రామసచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు సభ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసిన మండల టిడిపి నాయకులు

విశాలాంధ్ర-గాలివీడు:నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం కందుకూరు నందు నిన్న జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనలోజరిగిన సంఘటన దురదృష్టకరమని,మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు గాలివీడు మండల తెలుగుదేశం పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామని రాజంపేట పార్లమంటరీ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి సార్పంచ్ పార్ధ సారథి రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కేడం లక్ష్మయ్య లు తమ విచా రాన్ని వ్యక్తం చేశారు. గురువారం మండలకేంద్రంలో కందుకూరులో మరణించిన టీడీపి కార్యకర్తలకు ఘన నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.ఇలాంటి విపత్కర పరిస్థితిలో ఆ కుటుంబాలు మనోధైర్యంతో ఉండాలని వారి వెంట ఈదేశంలో ఉన్నటువంటి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ ఎల్లవేళలా అన్ని రకాలుగా చేదోడు వాదోడుగా ఉంటారని తెలియచేశారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వీర రాఘవులు,మాజీ సర్పంచులు రియాజ్,చిన్నపరెడ్డి,భద్రప్ప, ఆనంద్ బాబు, రాభాష , కదిరెడ్డి నాయుడు, వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణ,రమణ,ధర్మ, రామచంద్ర,టోపీపల్లి,తదితర తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు,నాయకులు పాల్గొనడం జరిగింది.